ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 30-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- విశ్వసనీయత, నైతిక విలువలు పాత్రికేయ రంగానికి కీలకమని ఉప రాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అన్నారు.
- భారత్, ఉజ్బెకిస్తాన్ దేశాల మధ్య సహకారం, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారతదేశం వేగంగా పయనిస్తోందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- నేపాల్‌లో సహాయక చర్యలను ముమ్మరం చేసేందుకు భారత్ నిరంతరం మద్దతు ఇస్తోందని కేంద్రమంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ వెల్లడించారు.

==========================

విశ్వసనీయత, నైతిక విలువలు పాత్రికేయ రంగానికి కీలకమని ఉప రాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అన్నారు. కేరళంలోని అలప్పుజలో కేరళం కౌముది పత్రిక 115వ వార్షికోత్సవ వేడుకలను ఉపరాష్ట్రపతి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పత్రికారంగం ముద్రణ నుండి టెలివిజన్, డిజిటల్ వేదికలు, సామాజిక మాధ్యమం, కృత్రిమ మేధ వైపు పయనించినప్పటికీ.. విశ్వసనీయమైన సమాచారం, పాత్రికేయ నైతిక విలువలు అత్యంత ప్రాధాన్యతను కలిగి ఉన్నాయని ఉపరాష్ట్రపతి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

భారత్, ఉజ్బెకిస్తాన్ దేశాల మధ్య సహకారం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటనలో భాగంగా రెండవ రోజున తాష్కెంట్‌లో ఆ దేశ అధ్యక్షులు షవ్‌కత్ మీర్జియోయెవ్‌తో ద్వైపాక్షిక సమావేశాన్ని నరేంద్ర మోదీ నిర్వహించారు. ఈ సందర్భంగా.. మైనింగ్, ఆయుర్వేదం, పర్యాటకం, ఆర్థిక, ద్రవ్య సంప్రదింపులు, సమగ్ర, వ్యూహాత్మక భాగస్వామ్యం, ఉన్నత విద్య, పర్యావరణం వంటి వివిధ రంగాలలో అవగాహన ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. అనంతరం నరేంద్ర మోదీ.. ప్రస్తుత వాణిజ్యానికి 5 రెట్ల అధికంగా 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోవడానికి నిర్ణయించామని వెల్లడిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

ఇదిలా ఉండగా ఇరు దేశాల మధ్య సహకారం కోసం చేసిన కృషికి, ప్రయత్నాలకు గాను నరేంద్ర మోదీ ఉజ్బెకిస్తాన్ అత్యున్నత పురస్కారం ఒలియ్ దరాజాలి దస్లిక్ ని అందుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్‌లో సహాయక చర్యలను ముమ్మరం చేసేందుకు భారత్ నిరంతరం మద్దతు ఇస్తోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమ పోస్ట్‌లో తెలిపారు. ఇటీవల సంభవించిన వరదలతో దెబ్బతిన్న నేపాల్‌కు భారతదేశం 68.5 టన్నుల సామగ్రిని అందించడంతో పాటు సహాయక చర్యల కోసం సాంకేతిక బృందాలు, ఫోరెన్సిక్ నిపుణులు పరికరాలను పంపింది. 11 టన్నుల సహాయక సామగ్రితో కూడిన నాలుగవ విమానం ఈరోజు నేపాల్‌లో దిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొంది. దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్‌లు, ప్లాస్టిక్ షీట్లు, పరిశుభ్రతా కిట్లతో సహా డీఎన్ఏ విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ నిపుణులను, పరికరాలను కూడా భారతదేశం నుంచి వచ్చినట్లుగా పేర్కొంది. ఈ నెల 26న సంభవించిన ఆకస్మిక వరదల విషాదం తర్వాత నేపాల్‌లో ఇప్పటివరకు 108 మంది భారతీయ పౌరులను రక్షించారని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమ పోస్ట్‌లో వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మారుతున్న కాలానికి అనుగుణంగా.. భారతదేశం రక్షణ రంగంలో స్వావలంబన సాధించే దిశగా వేగంగా పయనిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో ఈరోజు జరిగిన `పీఎం-సేతు సదస్సు`లో ఆయన ప్రసంగిస్తూ... రక్షణ రంగంలో దేశీయ తయారీని కేంద్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోందని గుర్తు చేశారు. రక్షణ రంగంలో ప్రైవేట్, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యాన్ని పెంచుతోందని అన్నారు. పీఎం-సేతు పథకం కింద, 200 హబ్‌లు ,800 స్పోక్‌ల నమూనాలో వెయ్యి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలు ఉన్నతీకరించబడుతున్నాయని ఆయన తెలిపారు. అంతకుముందు, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో సుమారు 101 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు రక్షణ మంత్రి శంకుస్థాపన చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరిసరాల పరిశుభ్రతకు దేశ ప్రజలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా ఈరోజు ప్రసారమైన మన్ కీ బాత్ కార్యక్రమం 137వ సంచిక ద్వారా ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఒక ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలనే సంకల్పం ప్రజలందరి నిబద్ధతగా మారినప్పుడు అది ఆ ప్రాంత స్వరూపాన్నే పూర్తిగా మారుస్తుందని చెప్పారు. నదీ తీర ఘాట్‌లతో సహా బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసేలా ఇతరులను ప్రేరేపించిన ఉత్తరప్రదేశ్‌లోని పట్వాయికి చెందిన ఆకాష్, రోహన్‌ల గురించి ప్రధానమంత్రి తెలిపారు. ఇదిలా ఉండగా మాదకద్రవ్య రహిత సమాజం కోసం కృషి చేయాలని నరేంద్ర మోదీ యువతని కోరారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సామాజిక మధ్యమాలలో అవగాహన కల్పించాలని కంటెంట్ సృష్టి కర్తలకు, యూ ట్యూబర్లలకు సూచించారు. అదే విధంగా, ఆంధ్రప్రదేశ్‌లోని కడపకు చెందిన వరదరాజ్ తమిళనాడులోని కొడైకెనాల్‌కు

చెందిన చంద్రశేఖరన్ వంటి వారు అవకాడో పండ్లను సాగు చేస్తూ... అదనపు ఆదాయాన్ని ఎలా పొందుతున్నారో నరేంద్ర మోదీ ప్రస్తావించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సైక్లింగ్‌ను తమ వారపు దినచర్యలో భాగంగా చేసుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ దేశ ప్రజలను కోరారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈరోజు జరిగిన `ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్` కార్యక్రమం ప్రత్యేక జాతీయ క్రీడా దినోత్సవ 88వ ఎడిషన్‌కు.. భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, రెజ్లర్ సంగ్రామ్ సింగ్, నటి మధురిమ తులి నాయకత్వం వహించారు. BRICS సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం.. దేశవ్యాప్తంగా 25 వేలకు పైగా ప్రదేశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... సైక్లింగ్ వలన శారీరక దృఢత్వంతో పాటు, కాలుష్య నియంత్రణ కూడా జరుగుతుందన్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా సెప్టెంబర్ 12, 13వ తేదీలలో `భారత్ మండపం`లో భారత్ 18వ BRICS శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్నందున.. ఈ ఎడిషన్‌కు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని మన్సుఖ్ మాండవియా పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉజ్బెకిస్తాన్ అత్యున్నత ప్రభుత్వ పురస్కారమైన ప్రతిష్టాత్మక `ఒలియ్ దరాజలి దోస్లిక్` (Oliy Darajali Do’stlik) ఆర్డర్‌తో సత్కరించబడినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభినందనలు తెలిపారు. సామాజిక మాధ్యమ పోస్టు ద్వారా స్పందించిన స్పీకర్.. ఈ గౌరవం భారత్-ఉజ్బెకిస్తాన్ సంబంధాలకు మూలమైన విశ్వాసం, ఆప్యాయత, సద్భావనకు, అలాగే ఈ చిరకాల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి చేస్తున్న నిరంతర కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఈ రోజు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2 లక్షల 65 వేల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని అధికార వర్గాలు తెలిపాయి. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2 లక్షల 73 వేల మంది దరఖాస్తు చేసుకోగా.. వీరిలో 2 లక్షల 65 వేల 980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =